క్లుప్తంగా

కలెక్టరేట్ సుందరీకరణను వేగవంతం చేయండి

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ ప్రాంగణం సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజాబాబు అధికారులను ఆదేశించారు. ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమావేశమయ్యారు. ఇంతకు ముందు జరిగిన సమావేశాల్లో కలెక్టరేట్ సుందరీకరణపై ఇచ్చిన అంశాలను పరిశీలించి త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వివిధ పనులపై కలెక్టరేట్‌కు విచ్చేసే ప్రజలకు ప్రాంగణంలో ఆహ్లాద వాతావరణం ఉండాలని చెప్పారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, ఆర్‌అండ్‌బీ ఈఈ ఎ. శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య పాల్గొన్నారు.

ఘంటసాల పోలీస్ స్టేషన్ తనిఖీ

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ పి. మురళీధర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించిన ఆయన క్రైం రేటు తగ్గడం, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేయడం, ఫ్రెండ్లీ పోలీస్ సిస్టంను అమలు చేయడంపై సంతృప్తి వ్యక్తంచేశారు. 2021, 22, 23 సంవత్సరాలకు సంబంధించి క్రైం రేట్ తగ్గడం, పెండింగ్ కేసులు లేకుండా చూడటంపై డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్‌ని అభినందించారు. కార్యక్రమంలో సీఐ నాగప్రసాద్, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు సూర్య ప్రకాశరావు మృతి



పెడన: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నల్లమోతు కోటి సూర్య ప్రకాశరావు (90) సోమవారం రాత్రి మృతిచెందారు. పెడన మండలం చేవేంద్ర గ్రామంలో నివాసం ఉంటున్న ఈయన అస్వస్థతకు గురికాగా విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కాంగ్రెస్ వాదిగా పేరు పొందిన ఈయన పీసీసీ అధ్యక్షుడిగా, చేవేంద్ర పీఏసీఎస్ అధ్యక్షుడిగా, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈయన భార్య సౌభాగ్యవతి మొట్టమొదటి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ ఏర్పడిన నాటి నుంచి పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. మండల నాయకులు కొండవీటి నాగబాబు, అచ్యుతరావు, రామానాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రక్షిత మంచినీటి సరఫరాకు రూ. 20 లక్షలు మంజూరు

గూడూరు: జల్ జీవన్ మిషన్ ద్వారా గూడూరు మండలం కలపటం గ్రామానికి రక్షిత తాగునీటి సరఫరాకు రూ.20 లక్షలు మంజూరయ్యాయని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఈ వెంకట రమణ తెలిపారు. గూడూరు మండలం కలపటంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామంలో ఇంటింటికీ రక్షిత నీటి సరఫరాకు మంచినీటి చెరువు, మైక్రో ఫిల్టర్లు, సంపు ఏర్పాట్లకు భూమిని పరిశీలించారు. జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి గ్రామ ప్రజలకు నీటిని సరఫరా చేసేలా చొరవ తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్ఈ ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచి శ్రీనివాసరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లా, కోడే చిన వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం

కృత్తివెన్ను: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల కమిటీ సమావేశం మంగళవారం కృత్తివెన్ను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అధ్యక్షతన జరిగింది. పీహెచ్‌సీలలో కుక్క, పాముకాటుకు సంబంధించిన మందుల లభ్యతపై ఎంపీపీ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అన్నిరకాల మందులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో సరఫరా చేస్తోందని వైద్యులు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ పిచ్చిబాబు, కృత్తివెన్ను, లక్ష్మీపురం పీహెచ్‌సీల వైద్యులు సందీప్, అల్తాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామికి అన్నాభిషేకం

బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామంలోని పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి వారికి కార్తిక అమావాస్య సందర్భంగా మంగళవారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర కమలార్చన, అన్నాభిషేకం పండితుల వేద మంత్రాల మధ్య నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

నేడు సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వ వైద్య కళాశాలలో 40కు పైగా సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సామాజిక, ఆర్థికాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఉత్సాహంగా 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో సామాజిక, ఆర్థికాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం 39, 40, 37 డివిజన్లలో మంగళవారం నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఇలాంటి ముఖ్యమంత్రిని చూడలేదని, రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో పార్టీ జెండాలను, ఆయా డివిజన్ల అభివృద్ధి వివరాలతో కూడిన సంక్షేమ పథకాల బోర్డులను పేర్ని కిట్టు నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్లు మేకల సుబ్బన్న, గూడవల్లి నాగరాజు, కాగిత జవహర్‌లాల్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు గోపిశెట్టి సతీష్, ఐనం తాతారావు, వైఎస్సార్ సీపీ 40వ డివిజన్ కన్వీనర్లు, నాయకులు తరకటూరి సీతారాముడు, పళ్లెం కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

● కోనేరుసెంటర్: అన్నివర్గాలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మనమంతా అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు వాలిశెట్టి రవిశంకర్, శౌంతి ఫరీద్, ఎస్ఎన్ గొల్లపాలెం మాజీ సర్పంచ్ మట్ట మోహన నాంచారయ్య, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బందరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన పేర్ని కిట్టు, నాయకులు

జగన్ పాలనలో విప్లవాత్మక మార్పులు

తలగడదీవి(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో సమాజంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ఇది ఆయనకు తప్ప మరెవ్వరికీ సాధ్యం కాదని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమం మండలంలోని తలగడదీవి సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. నాగాయలంక జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలనకు ప్రజలు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. జగనన్నే మా నమ్మకం అంటూ పేద, మధ్యతరగతి ప్రజలు ముక్తకంఠంతో నినదిస్తున్నారన్నారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి, రామ్ కుమార్, సర్పంచ్ వెంకటేశ్వరరావు, ముమ్మారెడ్డి చంటి, తోట సాయిబాబు, ఎంపీటీసీ మోకా నాగప్రసాద్, బండ్రెడ్డి లక్ష్మీనారాయణ (లక్ష్మణ్), నంద్యాల వెంకట కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రమణ, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తలగడదీవిలో సంక్షేమ బోర్డు ఆవిష్కరణ



లేళ్లగరువులో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు

● గూడూరు: గూడూరు మండలం లేళ్లగరువు గ్రామ సచివాలయంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్ణం పెదబాబు, లేళ్లగరువు, కపటం, జక్కంచర్ల సర్పంచులు నరహరిశెట్టి మానస, ఐనాల శ్రీనివాసరావు, ఆత్మూరి వెంకట రమణ, ఎంపీటీసీ వై.శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ రాయపురెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాత కరకట్టపై నివాసాల పరిశీలన



నాయకులతో మాట్లాడుతున్న జేసీ అపరాజిత సింగ్

చిరువోలు(మోపిదేవి): మోపిదేవి పాత కరకట్టపై నివాసాల వాస్తవ పరిస్థితిని జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మంగళవారం పరిశీలించారు. పాత కరకట్టపై దశాబ్దాల నుంచి కొంతమంది గృహాలు వేసుకుని నివాసం ఉంటున్నారు. పాత ఆర్సీ కరకట్టపై ఇళ్లు కట్టుకుని ఉంటున్న వాస్తవ పరిస్థితిని పరిశీలించి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని జేసీ తెలిపారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నందిగం మేరీరాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు రావి రాంప్రసాద్, ఆది రాంబాబు, రెడ్రౌతు వెంకట రమణ, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఉత్సవాలు

చల్లపల్లి: దేవాంగుల ఇలవేల్పు రామలింగ చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పడమరవైపు అమ్మవారి దేవాలయంలో అమ్మవారికి విశేష పూజలు, కుంకుమ పూజలు జరిగాయి. ప్రత్యేక వాహనంపై అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నీరు వారబోసి స్వాగతం పలికి పసుపు కుంకుమలు సమర్పించారు. యువత నృత్యాలతో సందడి చేశారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

నగరేశ్వరుని ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

నాగాయలంక: స్థానిక కన్యకా పరమేశ్వరి సమన్విత పార్వతీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో 31వ వార్షిక కార్తిక మాసోత్సవాలు మంగళవారం ఆధ్యాత్మిక శోభతో ముగిశాయి. 30 కిలోల ముద్ద కర్పూరంతో కార్తిక అఖండ జ్యోతి ప్రజ్వలన చేశారు. చిట్టాన్నపూర్ణయ్య, అనురాధ దంపతులు పీటలపై కూర్చోగా అర్చకుడు కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా పూజ చేశారు. ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు చేతుల మీదుగా కుండములలోని కర్పూరాన్ని అఖండ జ్యోతిగా ప్రజ్వలింప జేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

18 కిలోల కార్తిక జ్యోతి జల విహారం

స్థానిక శ్రీరామ పాదక్షేత్రంలో రామలింగేశ్వరునికి సమర్పించిన 18 కిలోల భారీ వత్తిని థర్మాకోల్ తెప్పపై అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ జ్యోతిని కృష్ణానదిలో విహరింపజేశారు. తొలుత రామలింగేశ్వరస్వామికి 35 కిలోల విభూదితో అభిషేకం చేశారు. శివ నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. రామలింగేశ్వరస్వామి వారికి నవవిధ (తొమ్మిది)ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం క్షేత్రం కమిటీ నేతృత్వంలో అవే ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, మండవ బాలవర్ధిరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ తలశిల రఘుశేఖర్, బోయపాటి రాము తదితరులు పర్యవేక్షించారు. బాణాసంచాతో కార్తిక ఉత్సవం ముగించారు.



నగరేశ్వరుని సన్నిధిలో అఖండ కర్పూర జ్యోతి



ప్రత్యేక అలంకారంలో శివలింగం



కృష్ణానది విహారంలో 18 కిలోల కార్తిక వత్తి జ్యోతి

క్రీడా పోటీల నిర్వహణకు ప్రాంగణాల ఎంపిక

పెడన: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పెడన పట్టణంలోని సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లికార్జునరావు అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ అధికారులతో కలిసి పలు క్రీడాప్రాంగణాలను మంగళవారం పరిశీలించారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ పల్లోటి హైస్కూల్, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాలతోపాటు దేవాంగ కల్యాణ మండపంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహణకు ఎంపిక చేశారన్నారు. పల్లోటిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడా పోటీలు వార్డు స్థాయి, పట్టణ స్థాయి విభాగాలలో జరుగుతాయని చెప్పారు. కళాశాల ప్రాంగణంలో క్రికెట్ పోటీలు, దేవాంగ కల్యాణ మండపంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హైస్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ బాబూలాల్, నాయకులు కటకం నాగకుమార్, కోమట్ల అనిల్, ఆడదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ అధికారులు సీహెచ్ మురళి, రాజీవ్, బాలాజీ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



పల్లోటి హైస్కూల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మల్లి, నాగకుమార్ తదితరులు

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు

గూడూరు తహసీల్దార్ విజయప్రసాద్

గూడూరు: తుపాను ప్రభావంతో తడిసిన, రంగు మారిన ధాన్యం కొనుగోళ్లలో రైతులను ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తే మిల్లర్లపై చర్యలు తప్పవని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ హెచ్చరించారు. గూడూరు మండలంలోని పలు రైస్ మిల్లులను మంగళవారం తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్ల రిజిస్టర్లను పరిశీలించి రైతుల దగ్గర కొనుగోళ్ల విషయంలో వారు ప్రభుత్వ మార్గదర్శకాలు ఏ మేరకు పాటిస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. తహసీల్దార్ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటల విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తోందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా మిల్లర్లు వ్యవహరించి తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వోలు ప్రసాద్, సుబ్బారావు, కరీముల్లా పాల్గొన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయప్రసాద్

ఈవీఎంలపై అవగాహన



పెడన: సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించే ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటరు మిషన్)పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి అన్నారు. మంగళవారం పెడన తహసీల్దారు కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఈవీఎంలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఈవీఎంల వినియోగం, వాటి ద్వారా ఓటు వేసే విధానంరు, ఓట్ల లెక్కింపు తదితరాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ నాయకుడు బండారు మల్లి, వివిధ పార్టీల నాయకులు, తహసీల్దార్లు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దారు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

బంటుమిల్లి: మండలంలో విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారని ఏఈ రవికుమార్ తెలిపారు. విజయవాడ విజిలెన్స్ డీఈఈ ఎస్ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో 35 బృందాలు 1,699 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారన్నారు. అధిక లోడు వాడుతున్న 138 మంది వినియోగదారులను గుర్తించి వారి నుంచి రూ. 4,67,698 అపరాధ రుసుం వసూలు చేశారని చెప్పారు. అధికలోడు వాడుకుంటున్న వినియోగదారులు నిబంధనల మేరకు క్రమబద్ధీకరించుకోవాలని డీఈఈ ప్రసాద్ సూచించారు. దాడుల్లో మచిలీపట్నం ఆపరేషన్ ఈఈ ఎం. బాస్కరరావు, పెడన, మచిలీపట్నం రూరల్, పామర్రు డీఈఈలు మాణిక్యాలరావు, శ్రీనివాసరావు, సుందరరావు, పలు మండలాల ఏఈఈలు, పలు ప్రాంతాలకు చెందిన విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ మీటరును తనిఖీ చేస్తున్న అధికారులు

సంకల్పబలంతో ఏదైనా సాధించవచ్చు

ఎంపీపీ గరుడప్రసాద్

కృత్తివెన్ను: వైకల్యం అనేది శరీరానికి మాత్రమేనని, సంకల్ప బలం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ దివ్యాంగ బాలల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, ఉపకరణాలను వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని దివ్యాంగులకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా వారి తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఎంపీపీ తన కుమారుడు వంశీకృష్ణ పేరుతో బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి. కృష్ణ, ఎంపీటీసీ సుజాత, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యేంద్రరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఎంఈఓలు త్రిపుర సుందరి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గరుడప్రసాద్

పోలి స్వర్గం నిర్వహణకు ఏర్పాట్లు

మచిలీపట్నంటౌన్: కార్తిక మాసం ముగింపు సందర్భంగా పోలిస్వర్గం కార్యక్రమం నిర్వహణకు నగరంలోని పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. బుధవారం తెల్లవారుజామున కార్తిక పోలి స్వర్గం దీపారాధనకు భక్తులు సన్నద్ధమయ్యారు. నాగులేరు కాలువతో పాటు పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టెల్లో అరటిడొప్పలపై దీపాలు వెలిగించి పూజలు చేయనున్నారు. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శివుని విగ్రహం వద్ద భారీ తొట్టెను ఏర్పాటు చేశారు. ఈ తొట్టెలో భక్తులు దీపాలు వెలిగించి పోలిని స్వర్గానికి పంపుతారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని వినతి

అవనిగడ్డ: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డీఎస్సీ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేసి తహసీల్దార్ రామకృష్ణకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం గాంధీక్షేత్రంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

కోడూరు: బ్లడ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం పూర్వ విద్యార్థులు రూ.25 వేలను అందజేశారు. సాలెంపాలెం గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి గూడా రాజ్‌కుమార్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ విజయవాడలోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాజ్‌కుమార్ తల్లిదండ్రులు కూలీ పనులు చేసి జీవనం సాగిస్తున్నారు. విషయం తెలుసుకున్న కోడూరు జెడ్పీ పాఠశాల 2003–04 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.25 వేల నగదును సమకూర్చి మంగళవారం చిన్నారి కుటుంబ సభ్యులకు అందించారు. పూర్వ విద్యార్థులు తిమ్మన వీరేంద్ర, జి.సురేంద్రరావు, అప్పికట్ల నరసింహారావు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక మాసం చివరి రోజు సందర్భంగా మంగళవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, పూర్ణాహుతి జరిగాయి. సాయంత్రం 6 గంటలకు వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హైస్కూల్ ప్లస్ విద్యార్థినుల ప్రతిభ

పురిటిగడ్డ(చల్లపల్లి): అంగలూరు ప్రభుత్వ శిక్షణ సంస్థ డైట్‌లో ప్రతిష్టాత్మక జిల్లా స్థాయి బాలోత్సవ్ కార్యక్రమంలో పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ ఇంటర్ ఫస్టియర్ బైపీసీ విద్యార్థిని జి.సుప్రియ శాస్త్రీయ సంగీతంలో ప్రథమ బహుమతి సాధించింది. ఇంటర్ సీఈసీ ఫస్టియర్ విద్యార్థిని ఎస్. సారిక డ్రాయింగ్ పోటీల్లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సుప్రియ, సారికలను, శిక్షణ ఇచ్చిన తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతిలను కేబీఎస్ హెచ్ఎం శర్మ, అధ్యాపకులు, విద్యా కమిటీ చైర్మన్ అభినందించారు.

జర్నలిస్ట్ కుటుంబానికి సాయం

అవనిగడ్డ: దివంగత జర్నలిస్ట్ క్లోపల్లి చంద్ర కుటుంబానికి ఎస్‌వీఎల్ క్రాంతి విద్యార్థులు రూ.27 వేలు ఆర్థిక సహాయం అందించారు. స్థానిక కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సీనియర్ పాత్రికేయులు దీవి సారంగపాణి అయ్యంగార్ ద్వారా అవనిగడ్డ ప్రెస్‌క్లబ్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. పాత్రికేయులు పి. శ్రీనివాసరావు, బాసు లంకబాబు, మునీశ్వరరావు, అజయ్‌బాబు పాల్గొన్నారు.

కమనీయం.. కార్తిక దీపోత్సవం



కోడూరు: కార్తికమాసం ముగింపును పురస్కరించుకొని కోడూరు గంగాభవానీ అమ్మవారి ఆలయంలో మంగళవారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో శివ లింగాకృతి, గంగానమ్మ అమ్మవారి రంగవల్లిని తీర్చిదిద్ది దీపాలు వెలిగించారు. ఆలయం చుట్టూ స్వస్తిక్, ఓంకారం ఆకారాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

పాఠశాలల సమాచారం అందజేయండి

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారం మండల విద్యా శాఖ కార్యాలయానికి అందజేయాలని ఎంఈఓ–1 త్రిపురసుందరీదేవీ అన్నారు. మంగళవారం ఎంఆర్‌సీ భవనంలో పాఠశాలల హెచ్ఎంల సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల వివరాలతోపాటు పాఠశాలలకు కావలసిన మౌలిక సౌకర్యాల సమాచారం పూర్తిగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో అందచేయాలన్నారు. పాఠ్యపుస్తకాల సరఫరా జిల్లా మేనేజరు ఏఎస్‌కే ఆంజనేయులు మాట్లాడుతూ పాఠశాలలకు వంద శాతం పాఠ్య పుస్తకాలు సరఫరా చేశామని, ఇంకా ఏమైనా అవసరమైన వారు ఎంఈఓ ద్వారా ఇండెంట్ పెట్టాలన్నారు. సమావేశంలో ఎంఈఓ–2 వెంకటేశ్వరరావు, అర్తమూరు కాంప్లెక్స్ కన్వీనర్ సీహెచ్ రామచంద్రరావు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణస్వామికి ఊంజల్ సేవ

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో కార్తిక బహుళ అమావాస్యను పురస్కరించుకుని స్వామివారికి మంగళవారం ఊంజల్ సేవ నిర్వహించారు. అర్చకులు దీవి అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సేవ కార్యక్రమాలు జరిగాయి. విష్ణు సహస్ర నామ పారాయణం, అష్టోత్తర కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్పల పడిపూజ



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం లంకపల్లిలో మంగళవారం రాత్రి అయ్యప్ప పడి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో హరిహర పుత్ర అయ్యప్ప స్వామివారి పడిపూజ నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శరణుఘోష మారుమోగించారు.